

పోలీస్‌స్టేషన్ వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

తన పంట పొలాన్ని దున్నేసిన వారిపై చర్యలు తీసుకోనందుకే..

యాడికి, ఆగస్టు 13: తన పంట పొలాన్ని దున్నేసిన వారిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయకుండా అన్యాయం చేస్తున్నారని కంబగిరిస్వామి అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. యాడికిలో పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం ఈ ఘటన జరిగింది. వీరన్నపల్లికి చెందిన కంబగిరిస్వామికి యాడికి గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 273-1లో నాలుగు ఎకరాల పొలం ఉందిజ అందులో కంది, సజ్జ పంటలు సాగుచేశాడు. ఈనెల 8న కొందరు వ్యక్తులు తాను సాగు చేసిన పంటల్లో కొంత భాగాన్ని ట్రాక్టర్‌తో దున్నేశారని బాధితుడు వాపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపాడు. భూమికి సంబంధించిన అన్ని రికార్డులను రెవెన్యూ కార్యాలయం నుంచి తీసుకువచ్చి ఇచ్చానని తెలిపాడు. అయినా పంటను దున్నేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధితుడు వాపోయాడు. తనకు న్యాయం చేయాలని వారం రోజుల నుంచి పోలీస్‌స్టేషన్ చుట్టు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. అందుకే ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. పురుగుల మందు తాగిన కంబగిరిస్వామిని యాడికి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు. కాగా కంబగిరిస్వామికి ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత అని అతడి బంధువులు హెచ్చరించారు. వారంరోజులుగా పోలీస్‌స్టేషన్ వద్దకు వెళుతున్నా పోలీసులు ఎందుకు స్పందించట్లేదని బాధితుడి బంధువులు ప్రశ్నించారు. పంటను దున్నేసి ఆర్థికంగా నష్టపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఆత్మహత్యకు యత్నించిన కంబగిరిస్వామి



చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

ఇద్దరిపై కేసు

పంట ధ్వంసం చేసిన కంబగిరిస్వామి, రమేష్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. పొలంలో కంది, సజ్జ పంటలను వారి సమీప బంధువులు ఇద్దరూ ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేశారని తెలిపారు. కంబగిరిస్వామి భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

పవనపుత్రా! పాహిమాం

ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు



అలంకారంలో నెట్టికంటి మూల విరాట్టు



పుష్పాలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో మురడి ఆంజనేయస్వామి

గుంతకల్లు/బొమ్మనహాళ్/డి.హీరేహాళ్, ఆగస్టు 13: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కసాపురం, నేమకల్లు, మురడి ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఏటా శ్రావణమాసంలో శని లేదా మంగళవారం ఒకే రోజు ఈ మూడు ఆలయాలను దర్శించుకోవడం భక్తులకు పరిపాటి. ఈ క్రమంలో ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని విశేష పుష్పాలు ఆభరణాలతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఆలయంలో హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణాలు చేశారు. కసాపురంలో రాత్రికి సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాములవారి ఉత్సవ విగ్రహాలను వెండి రథంపై ఆశీనులను గావించి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు.

కసాపురంలో వెండి రథంపై స్వామివార్ల ప్రాకారోత్సవం





ఒకే ఒక ఆశయం..!

నీరు నిలపాలి.. విపత్తును గెలవాలి

- టీబీ డ్యాం వద్ద మంత్రులు, నాయకులు
- స్టాప్ లాగ్ ఏర్పాటు పనుల పర్యవేక్షణ
- నిపుణులతో మంతనాలు.. నిధులకు భరోసా



తుంగభద్ర డ్యాం నిండింది. దిగువన ఆయకట్టు సేద్యానికి సిద్ధమైంది. జలాశయం గరిష్ఠ నీటి మట్టానికి చేరుకోవడంతో క్రస్ట్ గేట్‌ల ద్వారా నదికి వరద నీటిని వదిలారు. ఇంతలో అనుకోని విపత్తు ఎదురైంది. నీటి ఉధృతికి 19వ నంబరు క్రస్ట్ గేట్ ఐదు రోజుల క్రితం కొట్టుకుపోయింది. దీంతో డ్యాం ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడింది. వృథాగా దిగువకు పరుగులు తీస్తున్న నీటిని ఆపేందుకు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు, నిపుణులు రంగంలోకి దిగారు. ఈ అంశంలో ఏపీ ప్రభుత్వం మరింత చొరవ చూపింది. క్రస్ట్ గేట్ స్థానంలో స్టాప్ లాగ్ ఏర్పాటు చేసే ప్రక్రియను ముందుండి నడిపిస్తోంది. ఇలాంటి విషయాలలో పట్టున్న కన్నయ్య నాయుడిని రంగంలోకి దించింది. ఆయన అద్భుత ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ముందు ఉంచారు. జలాశయంలోని నీటిని ఖాళీ చేస్తేగానీ గేట్‌ను పునరుద్ధరించలేమని భావించిన స్థితి నుంచి.. పారే నీటిలోనే గేటును అమర్చే దిశగా, డ్యాంలో నీటి నిల్వల్లో సగానికి పైగా కాపాడుకునే దిశగా చర్యలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మంత్రులు పయ్యావుల, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని, గుమ్మనూరు తదితరులు మంగళవారం డ్యాంను సందర్శించారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య సైతం అక్కడికి వచ్చారు. నిపుణులతో చర్చించి.. తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. దేశంలో మునుపెన్నడూ జరగని అద్భుతాన్ని ఆవిష్కరిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. **- రాయదుర్గం/బళ్లారి**

(పూర్తి వివరాలు మెయిన్‌లో, 7లో..)



డ్యాం వద్ద మంత్రులు, నిపుణులు, నాయకులు



వృథా అవుతున్న నీటిని పరిశీలిస్తున్న మంత్రులు



డ్యాం వద్ద మంత్రులు, నాయకులు, అధికారుల పర్యటన



క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిన ప్రాంతం



సిద్ధమవుతున్న స్టాప్ లాగ్

ఇంజనీరింగ్ చరిత్రలోనే అద్భుతం: కేశవ్



తుంగభద్ర జలాశయంలో స్టాప్‌లాగ్‌ను ఏర్పాటు చేసి ఇంజనీరింగ్ చరిత్రలోనే అద్భుతం సృష్టించబోతున్నాం. వేగంగా, ఉధృతంగా ప్రవహిస్తున్న నీటికి అడ్డుకట్ట వేయడానికి చేస్తున్న ప్రయత్నం ఇది. ఈ ప్రక్రియలో సాంకేతికంగా చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూర్తిస్థాయిలో నీటిని కాపాడుకునే బాధ్యతను ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించాము. రాజకీయంగా ఎలాంటి జోక్యం ఉండదు. సీడబ్ల్యూసీ గైడెన్స్ ప్రకారం ఇంజనీర్లు నిర్ణయాలు తీసుకుంటున్నారు. కరువుసీమ ప్రాంతాన్ని కాపాడుకునేందుకు ఉన్న ఏకైక ప్రాజెక్ట్ తుంగభద్ర. వీలైనంత త్వరగా పనులు ముగించి ఈ సంక్షోభం నుంచి గట్టెక్కుతాం.

భయం లేదు.. మళ్లీ నిండుతుంది: సిద్దరామయ్య



వీలైనంత త్వరగా గేటును అమర్చి నీటి వృథాను అరికడతాం. వర్షాలు వచ్చి మళ్లీ జలాశయం నిండుతుంది. నేనే వచ్చి వాయనం సమర్పిస్తాను. 19వ గేటు ఎక్కువ కాలం మన్నిక వచ్చింది. 1954 నుంచి కాలువలకు నీరు వదిలారు. సుమారు 70 సంవత్సరాల పాటు క్రస్ట్‌గేట్లు మన్నిక వచ్చాయి. కన్నయ్య నాయుడు సూచనలతో స్టాప్‌లాగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఆగస్టు 17 తరువాత వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. రైతులు అధైర్యపడాల్సిన అవసరంలేదు.

రాతి కట్టడమే సమస్య: కన్నయ్య నాయుడు



తుంగభద్ర జలాశయానికి స్టాప్‌లాగ్ ఏర్పాటు చేయాలని గతంలో చాలా ప్రయత్నాలు చేశాం. రాతితో డ్యాంను నిర్మించడంతో సాధ్యం కాలేదు. ఒక్కరాయి కదిలినా పూర్తిగా నష్టపోవాల్సి ఉంటుంది. అందుకే స్టాప్‌లాగ్‌ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాం. తుంగభద్రలో ఈ సమస్య తొలిసారిగా ఎదురైంది. చైన్‌ల మార్పుతో పాటు రోప్‌ల మరమ్మతులు చేయాలని సీడబ్ల్యూసీకి ప్రతిపాదించాం. మా సూచన ప్రకారం గేట్లకు పూర్తిస్థాయి మరమ్మతులు చేస్తే 30 సంవత్సరాల పాటు ఇలాంటి ఇబ్బందులు ఎదురు కావు.

అందుకే ఈ దుస్థితి: కాలవ



టీబీ డ్యాం క్రస్ట్‌గేట్లను మార్చాలని సాంకేతిక నిపుణుడు కన్నయ్యనాయుడు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకోకపోవడమే ఈ దుస్థితికి కారణం. తుంగభద్ర డ్యాం నిండుకుండలా ఉండటంతో రైతుల ఆశలు చిగురించాయి. ఈ దశలో క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడం బాధాకరం. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి తలెత్తింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమస్య తలెత్తిన క్షణం నుంచి జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో చర్చిస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా నీటిని కాపాడుకునేందుకు ఉన్న మార్గాలన్నింటిని అన్వేషించాలని ఆదేశించారు. జూలైలోనే వర్షాలు వచ్చి జలాశయం నిండింది. ఇప్పుడు మళ్లీ వర్షాలు వస్తాయా రావా అన్నది తెలియడం లేదు. ఉన్న నీటిని సాధ్యమైనంత వరకు నిలుపకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

నీటి వృథా బాధాకరం: సీపీఐ

అనంతపురం విద్య: తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్ గేటు తెగిపోవడంతో జలాశయంలో నీరు వృథా అవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున తదితరులతో కలిసి ఆయన జలాశయాన్ని మంగళవారం పరిశీలించారు. జలాశయం కింద కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ పరిధిలో 12 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టుకు సరిపడా నీరు ఈ ఏడాది ఆగస్టుకు ముందే నిల్వ ఉండటంతో రైతులు సంతోషించారని అన్నారు. ఖరీఫ్ పంటల సాగు ప్రారంభిస్తున్న తరుణంలో గేటు తెగిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు అన్యాయం జరిగిందని అన్నారు. అప్పటి ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, కేంద్రంలో ప్రధాని మోదీ తుంగభద్ర జలాశయం అభివృద్ధిపై దృష్టి సారించలేదని విమర్శించారు. ప్రతి ఏటా గేట్లను పరిశీలించి, భద్రతా చర్యలు చేపట్టివుంటే ఇలాంటి సమస్య ఉండేది కాదని అన్నారు. త్వరితగతిన గేటును పునరుద్ధరించి, ఖరీఫ్ పంటల సాగుకు ఇబ్బంది లేకుండా చూడాలని డ్యాం పరిశీలనకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు.



హొస్పేటలో మంత్రి నిమ్మల రామానాయుడుతో సీపీఐ బృందం

అవినీతి పొగ

డంపింగ్‌యార్డ్ పనిలో దొంగ బిల్లు...?

రూ.రెండు కోట్ల కోసం విశ్వప్రయత్నాలు

మరోసారి కాంట్రాక్టు సంస్థ ఒత్తిళ్లు

అనంతపురం క్రైం, ఆగస్టు 13: అనంతపురం డంపింగ్‌యార్డ్‌లో అవినీతి పొగ ఆగడం లేదు. దొంగ బిల్లుల పేరుతో దోపిడీకి తరచూ ఏదో ఒక ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. నగరంలోని గుత్తి రోడ్డులో దాదాపు 13 ఎకరాల్లోని డంపింగ్‌యార్డ్‌లో బయోమైనింగ్ ప్రక్రియ నిర్వహించారు. నేవాస్‌గ్రీన్ అనే సంస్థ ఈ కాంట్రాక్టు చేపట్టింది. ఏడాదిన్నర సమయానికి రూ.23కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. రోజూ 120 టన్నుల చెత్త పోగవుతోంది. 3.32లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ చేయాల్సి ఉంది. కానీ ఆ పని జరగలేదు. ఈ క్రమంలో ఏడాది కంటే తక్కువ సమయంలో మొత్తం వర్క్ పూర్తి చేశామని చెప్పుకొచ్చారు. చేయకపోయినా రూ.9 కోట్ల పనులకు బిల్లు చేశారనే ఆరోపణలున్నాయి. ఇదంతా ఎన్నికల ప్రక్రియ ముందు వరకు జరిగిన వ్యవహారం. ఇక్కడితో ఆగలేదు. అవినీతి చేయాలని పట్టుదలగా ప్రయత్నిస్తున్నారు.

రూ.2 కోట్ల బిల్లు కోసం యత్నాలు...

ఎన్నికల తరువాత కూడా డంపింగ్‌యార్డ్‌లో బిల్లులు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రూ.2కోట్ల బిల్లుతో ఓ ఫైల్ ముందుకెళ్లింది. ఇంజనీరింగ్ అధికారుల సంతకాలతో వెళ్లిన ఆ ఫైల్‌పై కమిషనర్ సైతం చేశారు. అయితే చివరికి ఎగ్జామినర్ వద్ద ఆ ఫైల్‌కు బ్రేక్ పడింది. క్వొర్రీ వేస్తూ ఆ ఫైల్‌ను తిరస్కరించారు. గతంలో చేసిన రూ.9కోట్ల పనుల్లో రూ.4కోట్లకు ఆ కమిషనర్ ఉన్నప్పుడే బిల్లు చేయడం గమనార్హం. ఆయన తాజాగా బదిలీపై వెళ్లారు. ఇప్పుడు ప్రభుత్వం సైతం మారింది. కానీ ఇంకా ఒత్తిళ్లు వస్తూనే ఉన్నాయట. ఆ రూ.2కోట్ల బిల్లు చేయాలంటూ తాజాగా ఆ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధి ఎగ్జామినర్ వద్దకు వెళ్లారట. ఎవరో రాజకీయ నేత పేరు చెప్పినట్లు సమాచారం. దీంతో మీరు తప్పు చేశారు కాబట్టే రాజకీయ నేతలతో సిఫార్సు చేస్తున్నారని తిప్పి పంపారట. బిల్లు కోసం వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారా..? ఇప్పటికీ వారి మాట వినే వారున్నారా...? లేక ప్రస్తుత అధికారపార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నారా? అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



డంపింగ్ యార్డు

ఏంటో ఈ సిత్రం !

ఉద్యోగం ఒక చోట... జీతం మరోచోట

బదిలీ చేసినా విధుల్లో చేరని ఏపీఓలు

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

డ్వామాలో విచిత్రాలు



డ్వామా పీడీ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 13: జిల్లాలోని డ్వామా విభాగంలో చిత్రవిచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఫీల్డ్‌లో పనిచేయాల్సిన ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని డ్వామా పీడీ కార్యాలయంలో పనిచేస్తున్నారు. కానీ జీతాలు మాత్రం ఆయా మండలాల్లో తీసుకుంటు న్నారు. బదిలీలు చేసిన వారు వారికి కేటాయించిన స్థానాలకు వెళ్లరు. సుమారు 30మందికి పైగా ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పీడీ కార్యాలయంలో పని చేస్తున్నారు. ఐదేళ్లుగా ఇలాగే ఉంది. అలా పని చేస్తున్న ఉద్యో గులందరినీ ఫీల్డ్‌కు పంపమని జిల్లా కలెక్టర్ ఇటీవల జారీ చేసిన ఆదేశాలు అమలు కావడం లేదు. దీంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 10గంటల కు హాజరుకావాల్సిన ఉద్యోగులు 11 గంటల తరువాత వస్తున్నా అడిగేవారే లేరు. కాగా ఇటీవల జిల్లా కలెక్టర్ బదిలీ చేసిన ఎనిమిది మంది ఏపీఓల్లో ఆరుగురు ఇంతవరకు విధుల్లో చేరకపోవడం గమనార్హం.

పీడీ కార్యాలయంలో ఫీల్డ్ ఉద్యోగులు

ఫీల్డ్‌లో పనిచేయాల్సిన దాదాపు 30 మందికి పైగా సిబ్బంది పీడీ కార్యాలయంలో తిష్టవేశా రు. ఇందులో టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు (ఈసీ), కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లలో... పరమేష్ (బుక్కరాయసముద్రం), సురేంద్ర (నార్పల), రవీంద్ర (రాప్తాడు), రఘునాథ్‌రెడ్డి (గార్లదిన్నె), ఖాజా (గుత్తి), దేవరాజ్ (రాయదుర్గం), మల్లి కార్జున (రాయదుర్గం), విజయ్‌కుమార్ (కళ్యాణదుర్గం)లు పీడీ కార్యాలయంలో ఐదేళ్లుగా పనిచేస్తున్నారు.

ఈసీలలో ఈశ్వరయ్య (కూడేరు), సాయికిశోర్ (కంబదూరు) ఉన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లలో హనుమంతరెడ్డి (అనంతపురం రూరల్), లలితాదేవి (బుక్కరాయసముద్రం), ఇల్లూరుబాషా (బుక్కరాయ సముద్రం), రమణయ్య (గార్లదిన్నె), సాహెల్ హమీద్ (గుత్తి), సురేంద్ర (గుత్తి), అర్జున్ (కణేకల్లు), దాదాఖలందర్ (కణేకల్లు), గోపిలత (కూడేరు), గీతావాణి (కూడేరు), నాగమణి (నార్పల), రామచంద్రనాయుడు (నార్పల), ఇర్ఫానాబ్బాసి (నార్పల), సహ్రాబీ (పామిడి), వరలక్ష్మి (పామిడి), హెచ్‌ఆర్ శ్రీనివాసులు (పెద్దవడుగూరు), సందీప్ రెడ్డి (రాప్తాడు మాజీ ఎమ్మెల్యే పీఏ) పీడీ కార్యాలయంలో పనిస్తున్నారు. వీరంతా మండలాల్లో జీతాలు తీసుకుంటూ...జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు.

విధుల్లో చేరని ఏపీఓలు

జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఇటీవల ఎనిమిది మంది ఏపీఓలను బదిలీ చేశారు. వారిలో పుట్లూరు ఏపీఓ భాగ్యలక్ష్మిని బొమ్మనహాళ్‌కు, ఆత్మకూరు ఏపీఓ పుష్పావతి ని కళ్యాణదుర్గానికి, పీడీ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై ఉన్న ఆదినారాయణమ్మని తాడిపత్రికి, రాప్తాడు ఏపీఓ ఓబన్నను డీ హీరేహాళ్‌కు బదిలీ చేశారు. అలాగే కూడేరు ఏపీఓ సుజాతను కంబదూరుకు, గార్లదిన్నె ఏపీఓ మురళీకృష్ణను బెళుగుప్పకు, తాడిపత్రి ఏపీఓ రాజ్యలక్ష్మిని బ్రహ్మసముద్రానికి, పామిడి ఏపీఓ విజయభారతిని రాయదుర్గానికి బదిలీ చేశారు. వారెవరూ విధుల్లో చేరలేదు. వీరిలో ఇద్దరు డ్వామా పీడీ కార్యాలయంలోనే పనిచేస్తున్నారు.

చురుగ్గా గేటు ఏర్పాటు పనులు

ఐదు భాగాలుగా విడగొట్టి టీబీ డ్యాం క్రస్ట్ గేటు తయారీ

సీఎం చంద్రబాబు చొరవతో కన్నయ్యనాయుడి రాక

కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో కలిసి రాష్ట్ర మంత్రులు

పయ్యావుల, నిమ్మల సందర్శన



కన్నయ్యనాయుడితో చర్చిస్తున్న మంత్రులు

రాయదుర్గం, ఆగస్టు 13: తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేట్ స్థానంలో తాత్కాలిక స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయి. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మంత్రులు, ఎమ్మెల్యేలు అక్కడే మకాం వేసి పనులను వేగవంతంగా సాగేలా పర్యవేక్షిస్తున్నారు.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో కలిసి రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, జయరాంలు డ్యాంను మంగళవారం పరిశీలించారు. కొట్టుకుపోయిన క్రస్ట్‌గేట్ వద్ద పరిశీలించి అధికారులతో సమీక్షించారు. బోర్డు ఎస్ఈ శ్రీకాంత్ రెడ్డితో పాటు ఈఈలు, డీఈలతో సమీక్షలు నిర్వహించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో జలాశయాల క్రస్ట్‌గేట్ల నిర్మాణంలో విశేష అనుభవమున్న కన్నయ్యనాయుడును పిలిపించి ఆయన సారథ్యంలో తాత్కాలిక క్రస్ట్‌గేట్ పనులు జరిగేలా చూశారు. 60 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తున ఉండాల్సిన క్రస్ట్‌గేట్‌ను ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో దింపేందుకు సాధ్యపడదని అంచనాకు వచ్చి వాటిని ఐదు భాగాలుగా విడగొట్టారు. ఆ పనులను ఐదు కంపెనీలకు అప్పగించారు. 60 అడుగుల వెడల్పుతో నాలుగు అడుగుల ఎత్తున ఉండేలా షట్టర్లను తయారు చేయిస్తున్నారు. మరో మూడురోజుల్లో షట్టర్ల తయారీ ప్రక్రియ పూర్తి కానున్నట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం ఒక్కో షట్టర్‌ను ప్రవహిస్తున్న నీటిలో దింపి, ప్రవాహానికి అడ్డుకట్ట వేయనున్నట్లు వెల్లడించారు. వీటి కోసం అవసరమైన పెద్ద క్రేన్లను ఏర్పాటు చేసే బాధ్యతను జేఎస్‌డబ్ల్యు కంపెనీకి అప్పగించారు. బుధవారం ఉదయానికల్లా అవి చేరుకోనున్నట్లు తెలిపారు. జలాశయం వద్దకు సందర్శకులను అనుమతిని నిరాకరించారు. పోలీసులు పెద్ద ఎత్తున మొహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పనులు పూర్తి చేయిస్తాం: సీఎం సిద్దరామయ్య

జలాశయం వద్దకు మంగళవారం చేరుకున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ రెండు రాష్ట్రాలు సమన్వయంగా ముందుకెళ్లి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. క్రస్ట్‌గేట్ ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ అధికారులు సీడబ్ల్యూసీ ఆదేశాల ప్రకారం కన్నయ్యనాయుడు పనులు చేయిస్తున్నారని తెలిపారు. జలాశయంలో నీరు ఖాళీ అయినప్పటికీ మరిన్ని వర్షాలు కురిసి పనులు పూర్తి అయిన అనంతరం మళ్లీ జలాశయం నిండు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్ర, కర్ణాటకకు సంబంధించి తాగు, సాగుకు ఉపయోగపడే ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడం దురదృష్టకరమన్నారు. పనులను వీలైనంత తొందరలో పూర్తి చేసి నీటిని నిల్వ చేసేందుకు ఇంజనీరింగ్ బృందాలు కష్టపడుతున్నాయని తెలిపారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. పనుల పర్యవేక్షణ కు ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు.



కర్ణాటక సీఎం సిద్దరామయ్యతో మాట్లాడుతున్న మంత్రులు

సాయంత్రం దాకా పర్యటించిన మంత్రులు

జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం రాత్రికి తుంగభద్ర జలాశయం వద్దకు చేరుకుని అక్కడే మకాం వేశారు. మంగళవారం ఉదయాన్నే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు అక్కడకు చేరుకుని సాయంత్రం వరకు ఉండి పనులను పరిశీలించారు. అధికారులతో చిత్రపటాలను తెప్పించుకుని చేస్తున్న పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక, సాంకేతిక పరమైన సహకారాన్ని పూర్తిగా అందిస్తామని బోర్డుకు హామీ ఇచ్చారు. దీనిపై ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించి ఇక్కడే ఉండేలా చూస్తున్నామని స్పష్టం చేశారు. ప్రధానంగా బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డితో పాటు ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డితో ఏకాంతంగా చర్చించి గేట్ కొట్టుకుపోవడానికి గల కారణాలు, వైఫల్యం గురించి సమీక్షించారు. అనంతరం జలాశయం వ్యూ పాయింట్ వద్ద కు వెళ్లి నీటి నిల్వ పరిస్థితిని వీక్షించారు.




కొట్టుకుపోయిన గేటు వద్ద పరిశీలిస్తున్న మంత్రులు, నాయకులు



గేటు తయారీలో నిమగ్నమైన కార్మికులు

ఇన్‌ఫ్లో గురించి ఆరా

ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీరు నదికి వృథాగా వెళుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఇన్‌ఫ్లో పరిస్థితుల గురించి అధికారులతో మంత్రులు ఆరా తీశారు. పదేళ్లుగా ఆగస్టు మాసం చివర్లో ఏ మేరకు ఏ మాత్రం ఇన్‌ఫ్లో ఉందో కనుక్కున్నారు. 60 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి క్రస్ట్‌గేట్ ఏర్పాటు పనులు పూర్తి అయితే అనంతరం ఎగువన వర్షాలు కురిసి నీరు చేరే అవకాశాలపై ఆరా తీశారు. సెప్టెంబరు మాసంలో కూడా వర్షాలు ఉంటాయని అంచన వేశారు. ప్రస్తుతం కాలువల కింద పంటల సాగులో ఉండి లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెడుతున్న రైతాంగం నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



వృథాగా పోతున్న నీటితో నిండిపోయిన డ్యాం పరిసర ప్రాంతాలు

మినీ బస్సు బోల్తా

ఒకరి మృతి...10 మందికి గాయాలు



తండ్రిని తట్టిలేపుతున్న కుమారుడు తనీష్, ఇన్‌సెట్‌లో బోనాల హరి(ఫైల్)

తాడిమర్రి, ఆగస్టు 13: మండలంలోని దాడితోట అదానీ హైడల్ పవర్ ప్రాజెక్టు సమీపంలో మినీ బస్సు బోల్తా పడింది. దీంతో కడప జిల్లాకు చెందిన బోనాల హరి(37) మృతి చెందగా మరో పది మంది గాయపడినట్లు ఎస్ఐ నాగాస్వామి తెలిపారు. మృతుడి భార్య ఉమా మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు... కడప జిల్లా సింహాద్రిపురం మండలం కసనూరు గ్రామానికి చెందిన బోనాల హరి, ఆయన భార్య ఉమామహేశ్వరి కుమారుడు తనీష్ ద్విచక్రవాహనంలో కసనూరు నుంచి వెలిదండ్లకు వచ్చి అనంతపురం వెళ్తున్న మినీ బస్సు ఎక్కారు. అక్కడి నుంచి బస్సులోని వారితో కలిసి అనంతపురంలోని ఎస్ఎన్ హెర్బల్ న్యూట్రిషన్ వారు నిర్వహిస్తున్న సమావేశానికి బయల్దేరారు. దాడితోట సమీపంలో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. బోనాల హరి అక్కడికక్కడే మృతి చెందగా ఉమామహేశ్వరి, బాలచంద్రారెడ్డి, గోపాల్, శైలజ, దినేష్, హారిక, పెద్దవీరయ్య, హుసూరీబీ మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పులివెందులలోని వైద్య కళాశాలకు 108లో తరలించారు. డ్రైవర్ షేక్ మాబుషరీఫ్ మాత్రం ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు.

భయపడకు డాడీ..

ఘటనా స్థలంలో మృతుడు బోనాల హరి కుమారుడు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాడాతున్న తండ్రిని చూసి 'భయపడకు డాడీ. నీకు ఏమీకాదు' అంటూ రోదించడం చూసిన వారందరూ కన్నీటిపర్యంతమయ్యారు. ఎస్ఐ నాగాస్వామి కేసు నమోదు చేసుకుని బాధితులను విచారించేందుకు పులివెందులకు వెళ్లి పూర్తి వివరాలను సేకరించినట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్

పామిడి, ఆగస్టు 13: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన చాలా అవసరమని జిల్లా సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి, లీగల్ సెల్ అథారిటీ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ శివప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని పాళ్యం తండా గ్రామంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్యశాఖ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, మేనరిక వివాహాలు మానవ మనుగడకు ఎన్నో ఇబ్బందులు కలిగిస్తాయన్నారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అనంతరం 204 మంది గిరిజనులకు ఉచిత వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత, డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంఈఓ జయానాయక్, గ్రామ సర్పంచు వెంకటేష్‌నాయక్, ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఉదయార్క, డాక్టర్ మంజుల, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి హామీలను నెరవేర్చుతాం: మాజీ సీఎం కిరణ్



మాట్లాడుతున్న కిరణ్ కుమార్ రెడ్డి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 13: గడిచిన ఐదేళ్ల పాలనతో రాష్ట్రాన్ని తీవ్రమైన ఆర్థిక లోటులోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఒక్కో అంశాన్ని సరిదిద్దుతూ, కూటమి పార్టీలు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నారని అన్నారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో జిల్లాలను విభజించి రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని అన్నారు. జిల్లాల విభజనతో వాటి అస్తిత్వాన్ని కోల్పోయాయని, తానే ముఖ్యమంత్రిని అయ్యుంటే జిల్లాలను మళ్లీ ఏకంచేసి పాత జిల్లాలుగానే ఉత్తర్వులు ఇచ్చేవాడినని అన్నారు. విభజన హామీల్లో భాగంగా రూ.1.5 లక్షల కోట్లు ఏపీకి రావాల్సి ఉందని అన్నారు. ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, పరిపాలన దిద్దుబాటు, లా అండ్ ఆర్డర్ ప్రక్షాళన చేయాల్సి అవసరం ఉందని అన్నారు. సమర్థుడు, అనుభవం ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహాయ సహకారాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తారని అన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన వాటాలను రాబట్టి.. టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో వ్యవస్థలను బలోపేతం చేస్తామని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే రాయలసీమకూ సంపూర్ణంగా నీరు అందుతుందని అన్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం, ఆగస్టు 13: వివాహేతర సంబంధం నేపథ్యంలో కంబదూరు మండలంలోని ఐపార్సపల్లికి చెందిన దళిత తిప్పేస్వామి (42) మంగళవారం హత్యకు గురయ్యాడు. ఎస్ఐ అంజనేయులు తెలిపిన మేరకు... మృతుడు తిప్పేస్వామి చెక్కభజన మాస్టరుగా మంచి పేరు సంపాదించాడు. గ్రామాల్లో చెక్కభజన నేర్పిస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్ని నెలల కిందట కంబదూరు మండలంలోని రాళ్లపల్లిలో చెక్కభజన నేర్పడానికి వెళ్లాడు. అక్కడ ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీనిని గుర్తించిన ఆమె తమ్ముళ్లు రాజు, నరేష్ పద్ధతి మార్చుకోవాలని తిప్పేస్వామిని హెచ్చరించారు. అయినా ఆయనలో మార్పు రాలేదు. దీంతో తిప్పేస్వామిని హత్య చేయాలని వారు ప్లాన్ వేసుకున్నారు. ఇది ఇలా ఉండగా తిప్పేస్వామికి ఐపార్సపల్లిలో ఆర్డీటీ గృహం మంజూరైంది. దాని నిర్మాణానికి అవసరమైన సిమెంటు కోసం మంగళవారం కంబదూరుకు వచ్చాడు. సుమారు 40 బస్తాలు కొని ఒక వాహనంలో వాటిని వేసి గ్రామానికి పంపాడు. ఆ వాహనం వెళ్లిన కొద్దిసేపటికే తిప్పేస్వామి కూడా ద్విచక్రవాహనంపై గ్రామానికి బయలుదేరాడు. అప్పటికే కాపు కాచిన రాజు, నరేష్‌లు కంబదూరు మల్లేశ్వరస్వామి దారి మధ్యలో తిప్పేస్వామి వాహనాన్ని అడ్డుకున్నారు. నీకు ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మార్చుకోవా అంటూ వాగ్వాదానికి దిగారు. మద్యం మత్తులో ఉన్న వారు బండరాయిని తీసుకుని తిప్పేస్వామి తలపై కొట్టారు. రక్తపు గాయాలతో ఆయన అక్కడే స్పృహతప్పి పడిపోయాడు. ఆ దారిన వెళుతున్న ద్విచక్రవాహనదారులు గమనించి గుర్తుపట్టి తిప్పేస్వామి భార్య సుశీలమ్మకు సమాచారం అందించారు. భార్య సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న తిప్పేస్వామిని 108లో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సుశీలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



మృతి చెందిన దళిత తిప్పేస్వామి

నిందితుల అరెస్టు

దళిత తిప్పేస్వామి హత్య కేసులో నిందితులైన రాజు, నరేష్‌లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. ఈ మేరకు కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వివాహేతర సంబంధంతోనే హత్య చేసినట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 13: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 4500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి రూ.13, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

బీఫార్మసీ లాస్ట్‌చాన్స్ పరీక్షా ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 13: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ విద్యార్థుల లాస్ట్ చాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు మంగళవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మే, జూన్‌లో ప్రథమ సంవత్సరం (ఆర్09,13)తోపాటు ఒకటో, రెండో సెమిస్టర్ (ఆర్15) పరీక్షలు నిర్వహించామన్నారు. ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్స రాలకు సంబంధించిన ప్రథమ, ద్వితీయ సెమిస్టర్(ఆర్09,13,15) పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

80 శాతం సబ్సిడీ ఖరారు

అనంతపురం అర్బన్, ఆగస్టు 13: ప్రత్యామ్నాయ పంటల విత్తనాలకు 80 శాతం సబ్సిడీ ఖరారైంది. వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేరుశనగ, కంది తదితర పంటలు ఆశించిన స్థాయిలో సాగు కాలేదు. ప్రధాన పంటల సాగుకు అదును దాటిపోయింది. దీంతో జిల్లాకు 27,907 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కేటాయించారు. ఇందులో ఉలవలు 21,791 క్వింటాళ్లు, పెసలు 1,501, అలసంద 3,253, జొన్న 973, కొర్ర 369, మినుములు 20 క్వింటాళ్లు ఉన్నాయి. వీటి ధరలను ఖరారు చేయలేదు. కేవలం 80 శాతం సబ్సిడీని వర్తింపజేయాలని నిర్ణయించారు. త్వరలోనే ధరలు, పంపిణీ తేదీ ఖరారు చేస్తారని అధికారులు తెలిపారు.

చీనీ టన్ను రూ.17వేలు



అనంతపురం రూరల్, ఆగస్టు 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.17 వేలు, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 331టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

'డీఎస్సీ కోచింగ్‌లో అవకాశం కల్పించండి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 13: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గిరిజన విద్యార్థులకు అందించే డీఎస్సీ ఉచిత కోచింగ్‌లో 500 మందికి అవకాశం కల్పించాలని ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సాకే చిరంజీవి జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులును కోరారు. మంగళవారం డీటీడబ్ల్యూఓను రామాంజనేయులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది పేద గిరిజన విద్యార్థులు బీఈడీ, టీటీసీ పూర్తీచేసి డీఎస్సీ కోచింగ్ తీసుకోవడానికి ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇస్తామని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. అయితే దరఖాస్తులు చేసుకోవాలంటే టెట్ అర్హతను పెట్టడం జరిగిందన్నారు. దీనివల్ల అనేక మంది గిరిజన విద్యార్థులు ప్రస్తుతం టెట్ 2024 పరీక్షకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరందరూ నష్టపోయే అవకాశం ఉన్నందున టెట్ పరీక్ష రాయబోయే గిరిజన విద్యార్థులకు సైతం డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వాలని కోరారు.

కేరళ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య



కీర్తి (ఫైల్)

గుంతకల్లు, ఆగస్టు 13: మండలంలోని ఎన్. తిమ్మాపురం గ్రామంలోని శ్రీ రమ్యసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థిని ఎంఏ కీర్తి (20) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేరళలోని ఎర్నాకుళం పట్టణానికి చెందిన ఎంఏ కీర్తి బీఎస్సీ నర్సింగ్ జీఎన్ఎం మూడో సంవత్సరం చదువుతోంది. తరగతి గది నుంచి మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో వెళ్లిపోయిన ఆమె.. తిరిగి రాలేదు. మధ్యాహ్న భోజన సమయంలో మెస్‌కు కూడా రాకపోవడంతో స్నేహితులు ఫోన్ చేశారు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో గదికి వెళ్లి చూశారు. తలుపు గడియ పెట్టుకుని ఉరి వేసుకున్నట్లు గుర్తించి, అధ్యాపకులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది తలుపు బద్ధలుకొట్టి లోపలికి వెళ్లేసరికి ఆమె చనిపోయింది. విద్యార్థినికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, తండ్రి లేడని, తల్లి అనారోగ్యంతో బాధపడుతోందని, సోదరుడికి ప్రమాదంలో కాలువిరిగి ఆస్పత్రిపాలయ్యాడని పోలీసులు తెలిపారు. దీంతో మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని తెలిపారు. గుంతకల్లు డీఎస్పీ శివ భాస్కర్ రెడ్డి నర్సింగ్ స్కూల్‌కు వెళ్లి విచారించారు. విద్యార్థిని ఆత్మహత్య విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

తగ్గేదేలేదు..!

- బదిలీ వచ్చినా వెళ్లని సర్కిల్ ఇన్‌స్పెక్టర్
- ఏసీబీలో గురుశిష్యుల హవా
- సీఐ, కానిస్టేబుల్‌పై తీవ్ర ఆరోపణలు

అనంతపురం క్రైం, ఆగస్టు 13: ఆ సీఐపై లెక్కలేనన్ని అవినీతి ఆరోపణలున్నాయి. అయితే ఐదేళ్లుగా అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)లో పనిచేస్తున్న ఆయన చాలానే ప్రభావం చూపారనే విమర్శలొచ్చాయి. గతంలో బదిలీ చేయాల్సి వచ్చినా పై స్థాయిలో మేనేజ్ చేసుకుని ఇక్కడే ఉండిపోయారు. గత నెలలో ఆ సీఐను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ ఈయనేమో వెళ్లేదిలేదంటూ చెబుతున్నారట. ఇక ఈయన శిష్యుడైన ఓ కానిస్టేబుల్ మరింత రెచ్చిపోతున్నాడట. సీఐ ఇంట్లో వ్యక్తిగత పనులు చేసి పెట్టే ఈ కానిస్టేబుల్ నాలుగేళ్లుగా బాగానే అక్రమార్జన చేశాడట. ఈ గురు శిష్యులకు ఆ శాఖ రాష్ట్ర స్థాయిలో పరిపాలనా విభాగంలో పనిచేస్తున్న శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఓ అధికారి అండ ఉందట. ఆ అధికారి ఇక్కడికి వస్తే సకల సౌకర్యాలు వీరిద్దరే కల్పిస్తుండటంతో ఆయన అభయం ఉందట. దీంతో ఈ ఇద్దరూ ఏసీబీలో తమకెదురే లేదని చెప్పుకుంటున్నట్లు సమాచారం. కానిస్టేబులైతే మా సీఐ సర్ ఉన్నంతవరకూ నన్నెవడేం చేయలేడంటూ బీరాలు పలుకుతున్నాడని ప్రచారం జరుగుతోంది. ఆ శాఖ ఉన్నతాధికారులకు మరి వీరి మాటలు చెవికెక్కాయో లేదో. గత నెల 24న సంబంధిత సీఐను కర్నూలు డీఐజీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశాలందాయి. కానీ ఎవరిని మేనేజ్ చేసుకున్నారో కానీ ఆ సీటు వదలడం లేదు.

న్యాయాధికారుల నియామకం

అనంతపురం క్రైం, ఆగస్టు 13: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో కొత్తగా న్యాయాధికారులను నియమించారు. కొందరు న్యాయాధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారులను కొత్తగా నియమించారు. హిందూపురానికి లలితాలక్ష్మిని, అక్కడ పనిచేస్తున్న ఎస్.రాజ్యలక్ష్మిని ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారిగా నియమించారు. వెంకట హరీష్‌ను ధర్మవరానికి, అక్కడ పనిచేస్తున్న రమ్యసాయిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా నియమించారు. తెలంగాణకు చెందిన శ్వేతను గుత్తికి కేటాయించారు. హైదరాబాద్‌కు చెందిన పావనిని అనంతపురం ఎక్సైజ్ కోర్టుకు, విజయవాడకు చెందిన క్రిష్ణవేణిని తాడిపత్రికి కేటాయించారు.

బాలుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు



మనోజ్‌కుమార్

గుత్తి, ఆగస్టు 13: తమ కుమారుడు మనోజ్‌కుమార్ అదృశ్యమైనట్లు పట్టణంలోని కోట వీధికి చెందిన తల్లిదండ్రులు కుళ్లాయిస్వామి, చౌడమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడు స్థానిక కోట వీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలుడు ఇంటికి తిరిగి రాలేదన్నారు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీడిపల్లికి ఇన్‌ఫ్లో 565 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 13: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 565 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. రిజర్వాయరులో ప్రస్తుత నీటి నిల్వ 0.314 టీఎంసీలు ఉందన్నారు.

వయనాడ్ బాధితులకు డాక్టర్లు, మెడికోల సాయం

వైద్యమంత్రికి రూ.4,08,602 అందజేత



వైద్యమంత్రి సత్యకుమార్‌కు చెక్‌ను అందజేస్తున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, ఆగస్టు 13: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు అనంతపురం జీజీహెచ్ డాక్టర్లు, మెడికోలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల సంభవించిన వరదలకు వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి వందలమంది ప్రాణాలు కోల్పోగా అనేకమంది నిరాశ్రయులయ్యారు. అక్కడ పరిస్థితులను చూసి చలించిపోయిన అనంత వైద్యకళాశాల డాక్టర్లు, పీజీ డాక్టర్లు, హౌస్‌సర్జన్లు, మెడికోలు తమవంతుగా రూ.4,08,602లు వసూలు చేశారు. ఆ సొమ్మును వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మంగళవారం విజయవాడలో రాష్ట్ర వైద్యశాఖామంత్రి సత్యకుమార్‌కు చెక్ రూపంలో అందజేశారు. వైద్యకళాశాల డాక్టర్లు, మెడికోలను మంత్రి అభినందించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే పరిటాల సునీత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ధర్మవరం రూరల్(కనగానపల్లి), ఆగస్టు 13: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, అందుకోసం మండలాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఫిర్యాదులరూపంలో స్వీకరించి తక్షణమే పరిష్కారం చూపుతున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత పేర్కొన్నారు. మంగళవారం కనగానపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే పరిటాలసునీత మాట్లాడుతూ రైతుల విషయంలో రాజకీయాలు చేస్తారా..? విద్యుత్ సమస్యలపై రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉన్నామన్నారు. కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై స్పందించి వెంటనే వాటిని పరిష్కారం చూపాలని ఆయా శాఖ అధికారులకు ఆదేశించారు. తాము ఎక్కడికి వెళ్లినా గత వైసీపీ ప్రభుత్వంలో భూ ఆక్రమణలు, పింఛన్లు, రేషన్‌రద్దు, రోడ్డు సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి రాజకీయాలకు అతీతంగా అర్హులైన రైతులకు, పింఛన్‌దారులకు న్యాయం చేయాలని, ముఖ్యంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదును ప్రతి ఒక్కటి తప్పక పరిష్కారం చూపుతామని ఇందుకు తమకు కొంతసమయం ఇవ్వాలని ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా రైతుల ఆర్థికాభివృద్ధి కోసం విరివిగా హార్టికల్చర్‌లో పండ్లతోటల పెంపకం కోసం ప్రోత్సాహకాలు అందిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, తహసీల్దార్ రమాదేవి, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, కన్వీనర్ యాతంపోతలయ్య, సుధాకర్‌చౌదరి, అంకే రామకృష్ణ, ఎంపీటీసీ బిల్లేభాస్కర్, సర్పంచ్‌లు చంద్ర, రామాంజి, మాధవ, శ్రీరాములు, తెలుగుయువత బట్టాసురేష్‌చౌదరి పాల్గొన్నారు.

నేడు రాప్తాడుకు రాక

రాప్తాడు: ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం రాప్తాడుకు రానున్నట్లు కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించండి

అర్బన్ ఎమ్మెల్యేకు సీపీఐ నేతల వినతి

అనంతపురం విద్య, ఆగస్టు 13: నగరంలోని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతోపాటు, ఇతర ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి వాటిని పరిష్కరించాలని సీపీఐ నాయకులు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌ను కోరారు. మంగళవారం ఆ పార్టీ నాయకులు అర్బన్ టీడీపీ ఆఫీస్‌లో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ కల్పనజోష్, చంద్రరాజేశ్వర్‌రావు, పార్వతమ్మకాలనీల్లో 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని పేదలు నివాసముంటున్నారన్నారు. వాళ్లకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, హౌసింగ్ కింద ఇళ్లు వచ్చేలా చూడాలని కోరారు. ప్రభుత్వాసుపత్రికి నిత్యం 2500 మందికిపైగా రోగులు వస్తున్నారని, సరిపడ పడకలు, మందులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 36 మంది డాక్టర్లకు గాను కేవలం 15 మంది ఉన్నారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కోట్ల రూపాయల స్థలాలు కబ్జా అవుతున్నాయన్నారు. వాటిని కాపాడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నగర సహాయకార్యదర్శులు రమణ, అల్లిపీరా, ఇతర నేతలు మునాఫ్, సుందర్ రాజు పాల్గొన్నారు.

315 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ఆంధ్రజ్యోతికి స్పందన

అనంతపురంరూరల్, ఆగస్టు 13: చెత్తతొట్టె ఎక్కిన ట్రాన్స్‌ఫార్మర్ కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించారు. నగరంలోని బుద్ధవిహార్ రోడ్డులో చెత్తతొట్టెపై ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఓవర్‌లోడ్ కారణంగా 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు మరో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అదనంగా ఏర్పాటు చేశారు. ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించి ఆ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి 315 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్ తెలిపారు.

ర్యాగింగ్ రహిత వాతావరణం ఉండాలి

-సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 13: యూనివర్సిటీలో ర్యాగింగ్ రహిత వాతావరణం ఉండాలని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ఎస్ఏ కోరి అధికారులకు సూచించారు. మంగళవారం వర్సిటీ ప్రాంగణంలో ర్యాగింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నూతన వర్సిటీలో విశాలమైన భవనాలు నిర్మించి విద్యాభ్యాసానికి అవసరమైన అధునాతన వసతులు ఏర్పాటుజేయడం జరిగిందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతశిఖరాలను చేరుకునేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రొఫెసర్లు రామిరెడ్డి, షీలారెడ్డి, అధ్యాపకులు కేశవరెడ్డి, ఆంజనేయులు, సందీప్, కావ్య, బాబు, రాజేష్ పాల్గొన్నారు.

'ప్రతి విద్యార్థిలో దేశభక్తి పెంపొందాలి'


బహుమతులు పొందిన వారితో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 13: ప్రతి విద్యార్థిలో ప్రాథమిక దశనుంచే దేశభక్తిని పెంపొందించాలని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం జడ్పీ ఆవరణంలో ఆమె బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులకు సాంస్కృతిక, సామాజిక స్పృహ, సేవ, క్రీడా భావాలను పెంపొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి నందిత, సభ్యులు చాందిని, ఈరమ్మ, ప్రసిల్లా, రాజా, ధోని పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం కేసు.. భర్తకు ఏడాది జైలు

అనంతపురం క్రైం, ఆగస్టు 13: భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ మంగళవారం అనంతపురం పీఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి శంకర్‌రావు తీర్పు వెలువరించారు. అనంతపురం నగరంలోని ఆదర్శనగర్‌కు చెందిన శ్రావణ్‌కుమార్‌కు శిక్ష పడింది. 2019లో జూలై 22న ఆదర్శనగర్‌లోని ఇంట్లో ఉండగా సువర్ణకుమారిబాయిపై భర్త శ్రావణ్‌కుమార్ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదుచేయడంతో అప్పటి సీఐ జాకీర్‌హుసేన్ కేసు దర్యాప్తు చేపట్టి కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతపురం పీఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి శంకర్‌రావు నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున రమణారెడ్డి వాదించారు. నిందితుడిని సకాలంలో కోర్టుకు హాజరు పరచి జైలు శిక్ష పడేలా కోర్టు హెడ్ కానిస్టేబుల్ సాలప్ప, కానిస్టేబుళ్లు కుమార్, రామకృష్ణ సహకరించారు.

మహిళపై దాడి

అనంతపురం క్రైం, ఆగస్టు 13: మహిళపై దాడి చేసిన ఘటనలో నాలుగోపట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రామ్‌నగర్‌లో రెడ్డమ్మ, నూర్ మహమ్మద్ పక్కపక్కనే షాపులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విద్యుత్ కనెక్షన్ తీసుకునే విషయంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. ఈ క్రమంలో నూర్‌మహమ్మద్ రెడ్డమ్మ తలపై పైపుతో దాడి చేశాడు. బాధితురాలు ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

'పాడి రైతులకు రుణాలు ఇవ్వండి'

శింగనమల ఆగస్టు 13: పాడిరైతులకు విరివిగా రుణాలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ కల్లూరు స్టేట్‌బ్యాంక్ మేనేజర్ రామాంజనేయులును మంగళవారం కోరారు. గొర్రెలు, మేకల పెంపకానికి రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మధుయాదవ్, రామసూబ్బారెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

టీవీ - 5 కెమెరామన్‌కు ప్రముఖుల నివాళి

అనంతపురం అర్బన్, ఆగస్టు 13: గుండెపోటుతో మృతి చెందిన టీవీ-5 కెమెరామన్ శేఖర్‌కు ప్రముఖులు నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మంగళవారం రాత్రి స్థానిక హౌసింగ్ బోర్డులోని మృతుడి నివాసంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మృతుడి భార్య, కుటుంబసభ్యులను ఓదార్చారు. అదేవిధంగా ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, ఎంఎస్ రాజు పరామర్శించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, మాజీ మేయర్ స్వరూప, టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, జిల్లా మీడియా కో - ఆర్డినేటర్ కూచి హరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీలు నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం ఎంఎస్ రాజు రూ.50వేలను శేఖర్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

కలెక్టర్ వినోద్‌కుమార్ సంతాపం

శేఖర్ మృతిపై కలెక్టర్ వినోద్‌కుమార్, ఐఅండ్‌పీఆర్ రాష్ట్ర డైరెక్టర్ హిమాన్షు శుక్లా వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

లబ్ధిదారులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

టిడ్కో ఇళ్ల పరిశీలన


టిడ్కో ఇళ్ల ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురంరూరల్, ఆగస్టు 13: అసలైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ పంచాయతీ సమీపంలోని టిడ్కో ఇళ్లను సంబంధిత అధికారులు, టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే పరిశీలించారు. టీడీపీ హయాంలో నిర్మాణాలు ఎక్కడి వరకు జరిగాయి..? ప్రస్తుతం వాటి పరిస్థితి ఏంటి..? తదితర విషయాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్మాణ పనులు ఇంచ్ కూడా ముందుకుసాగలేదన్నారు. పేదలకు అపార్ట్‌మెంట్ తరహాలో ఇల్లు నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లను నిర్మించడం జరిగిందన్నారు. 80 శాతం పూర్తయ్యాయని, అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు వాటిని పట్టించుకున్న పాపానపోలేదన్నారు. అంతేకాకుండా లబ్ధిదారుల పేర్లు మార్చి వైసీపీ నాయకులు, కార్యకర్తలకు కేటాయించారన్నారు. అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి న్యాయం చేస్తామన్నారు. గృహనిర్మాణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల నిర్మాణాల్ని వేగవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హరిప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీ, రాష్ట్ర నాయకులు గంగారామ్, మైనార్టీసెల్ అధికార ప్రతినిధి ఫిరోజ్, జిల్లా మీడియా కో ఆర్డినేటర్ కూచిహరి, అధికార ప్రతినిధి సరిపూటి రమణ, క్లస్టర్ ఇన్‌చార్జిలు రాజారావు, వన్నూరప్ప, బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ, టీఎన్‌టీయూసి జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహులు, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రోత్సాహంతోనే విజయాలు సాధ్యం

అనంతపురం క్లాక్‌టవర్: క్రీడాకారులను ప్రోత్సహిస్తుంటే విజయాలు సాధ్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దుగ్గుపాటి ప్రసాద్ అన్నారు. జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం అనంత క్రీడాగ్రామంలో కొనసాగాయి. ఈ పోటీల ప్రారంభానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. క్రీడలకు ఆర్డీటీ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో గోవాపై హర్యాణా జట్టు విజయం సాధించింది. మరోపోటీలో పశ్చిమబెంగాల్‌పై మణిపూర్ జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగారామ్, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, డైరెక్టర్ రాజేష్, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, టీడీపీ యాదవ సాధికారత కమిటీ సభ్యుడు నారాయణస్వామి యాదవ్, దరూర్ ఓబుళనాయుడు, జిల్లా కార్యదర్శి బి మల్లేష్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై క్రమశిక్షణ చర్యలు

సమీక్షలో డీఎంహెచ్‌ఓ హెచ్చరిక


మాతాశిశు మరణాలపై డాక్టర్లు, సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, ఆగస్టు 13: మాతాశిశుమరణాలకు కారణాలను పరిశీలించి అందులో ఆశా కార్యకర్తల నుంచి మెడికల్ ఆఫీసర్ల వరకు ఎవరి లోపం ఉన్నా వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. మంగళవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో గతనెలలో జరిగిన రెండు మాతృమరణాలు, 19 శిశుమరణాలపై సమీక్ష నిర్వహించారు. మరణాలు జరగడానికి కారణాలను సంబంధిత పీహెచ్‌సీ, సీహెచ్‌సీల డాక్టర్లు, నర్సులు, ఆశాకార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో ఒక నెలలో ఇన్ని మాతృమరణాలు, శిశుమరణాలు జరగడం ఎంతో బాధకలిగిస్తోందన్నారు. కలెక్టర్, రాష్ట్ర ఉన్నతాధికారులు ఈ మరణాలపై చాలా సీరియస్‌గా ఉన్నారన్నారు. మరణాలకు అదికారణం, ఇదికారణం అంటూ చెప్పి తప్పించుకోవాలని మీరు చూస్తున్నారని, ఇక నుంచి అలా కుదరదన్నారు. ఈ మరణాలపై పక్కాగా కమిటీ ద్వారా పరిశీలన జరిపి లోపము ఎక్కడో గుర్తించి అందుకు కారకులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా మరణాలు జరిగినపుడు ఏ రకమైన ఇబ్బందులు నెలకొన్నాయి..? వాటికి కారణాలు తెలుసుకొని మళ్లీ అలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసవం పొందిన తర్వాతకూడా జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. నోడల్ టీమ్స్‌సైతం మరణాలు జరిగినపుడు క్షేత్రస్థాయికి వెళ్లి విచారించి కారణాలను తెలుసుకోవాలని సూచించారు. అత్యధికంగా అధిక రక్తస్రావంతోనే మాతృ మరణాలు జరుగుతున్నాయని, ఇలాంటి వారిపట్ల ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బిడ్డల ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్, నోడల్ అధికారి డాక్టర్ యుగంధర్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుదాం

డీఎస్పీ టీవీవీ ప్రతాప్

78 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన

అనంతపురం కల్చరల్, ఆగస్టు 13: స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుదామని అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్ అన్నారు. 78వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి 78 అడుగుల జాతీయ జెండాతో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతోపాటు విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎంతోమంది వీరుల త్యాగఫలంతోనే బ్రిటీష్ పాలకులనుంచి దేశానికి విముక్తి లభించిందన్నారు. స్వాతంత్ర్యంకోసం మహాత్మాగాంధీ శాంతిమార్గంలో నడిపించిన పోరాటాన్ని విద్యార్థులు స్మరించుకోవాలన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన, మహిళల రక్షణ అంశాల్లో అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రధానంగా చట్టాలను కాపాడే అంశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వాములవ్వాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ దేశస్వాతంత్ర్య పోరాటంలోని నాయకులు కలలుగన్న సమాజ నిర్మాణం విద్యార్థులతోనే సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు, నగర అధ్యక్ష కార్యదర్శులు శివ, భీమేష్, ఐద్వా నాయకురాళ్ల చంద్రిక, కుమారి, రాధా, లలితమ్మ పాల్గొన్నారు.

వందక్వింటాళ్ల

రేషన్ బియ్యం పట్టివేత


అనంతపురం టౌన్, ఆగస్టు 13: జిల్లాకేంద్రంలో పేదలకు సరఫరా చేయాల్సిన అక్రమ రేషన్ బియ్యం నిల్వచేసిన ఇంటిపై అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. పాతూరుకు చెందిన మాధవి పేదలకు వెళ్లాల్సిన బియ్యంను చౌకగా కొనుగోలు చేసి ఓ ఇంటిలో నిల్వ ఉంచింది. అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, పౌరసరఫరాల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు దాడిచేశారు. అక్కడనిల్వ ఉంచిన వందక్వింటాళ్ల బియ్యానికి సంబంధించి పంచనామా చేసి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి కేసునమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

భూమి కోసం సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

చిన్నాన్నే అన్యాయం చేస్తున్నాడని ఆవేదన... పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఘటన... డీఎస్పీ, సీఐ హామీతో ఎట్టకేలకు దిగివచ్చిన వైనం


మైకుద్వారా సర్దిచెబుతున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 13: తాతకు సంబంధించిన భూమిలో తన వాటా ఇవ్వకుండా చిన్నాన్న తనకున్న రాజకీయ పలుకుబడితో భూమిని తనపేరిట చేసుకుని తీవ్ర అన్యాయం చేశాడంటూ ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటంపల్లి గ్రామంలో మహేంద్ర అనే యువకుడు ఉంటున్నాడు. అతడి పూర్వీకులకు 3-80 ఎకరాల భూమి ఉంది. తన తండ్రి మృతి చెందడంతో అందులో 1.50 ఎకరాల భూమి తనకు ఇవ్వాలని చిన్నాన్న క్రిష్ణమూర్తిని 13ఏళ్ల నుంచి కోరుతున్నాడు. ఎంతవేడుకున్నా అతడు లెక్కచేయలేదు. తనకున్న రాజకీయ పలుకుబడితో భూమి ఇవ్వకపోగా అతడిపై కేసులు పెట్టించాడు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన మహేంద్ర మంగళవారం సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న అతడి తల్లి, భార్య, కుమారుడు అక్కడకు చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. గ్రామస్థులు పెద్దసంఖ్యలో చేరి మహేంద్రకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. సమాచారం తెలుసుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శివాంజనేయులు అక్కడికి చేరుకుని న్యాయం చేస్తామని మైకుద్వారా తెలియజేసినా వినలేదు. తన చిన్నాన్నతో భూమి ఇస్తానన్న విషయాన్ని చెప్పించాల్సిందిగా కోరాడు. పోలీసులు అదేవిధంగా చేసినా మహేంద్ర సెల్‌టవర్ నుంచి కిందకు దిగలేదు. ఆస్తి విషయంలో న్యాయం చేస్తామని, నీపై ఉన్న కేసులు కొట్టివేస్తామని, కిందకు రావాలని పోలీసులు చెప్పడంతో సాయంత్రం నాలుగు గంటలకు సెల్‌టవర్ ఎక్కిన మహేంద్ర రాత్రి 7.45 గంటలకు దిగివచ్చాడు. డీఎస్పీ, సీఐలు పోలీస్‌స్టేషన్‌లో మహేంద్రతో ప్రత్యేకంగా మాట్లాడి భూ సమస్య తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


సెల్ టవర్ ఎక్కిన మహేంద్ర

ఆసుపత్రిలో దుష్ప్రచారం... వైద్యుల ఆవేదన

అనంతపురం టౌన్, ఆగస్టు 13: సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓ వీడియో వ్యవహారం దుమారం రేపింది. దీనిపైనే మంగళవారం ఆసుపత్రిలో తీవ్ర చర్చ జరిగింది. అయితే ఈ వ్యవహారంపై ఆసుపత్రి వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. వైద్యులు రోగులకు ఎంతో బాధ్యతగా చికిత్సలు చేస్తున్నారని వివరించారు.

బొలెరో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ధర్మవరంరూరల్ (కనగానపల్లి), ఆగస్టు 13: మండలంలోని భానుకోట పుట్టకనుమ వద్ద బొలెరో బోల్తాపడి డ్రైవర్ గోవిందు తీవ్రంగా గాయపడ్డాడు. కంబదూరు మండలం పాల్తూరు నుంచి కనగానపల్లికి బొలెరో మంగళవారం సాయంత్రం కనగానపల్లికి వస్తోంది. ఈ సందర్భంలో ముందరటైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ గోవింద్‌నాయక్‌కు గాయాలుకాగా అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 13: ఇంటి పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబానికి మాదిగ ఇంటలెక్చువల్ ఫోరం రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందించింది. మంగళవారం ఫోరం ప్రతినిధులు మారెప్ప, హరిప్రసాద్, రాజ, శశికళ, మనోజ్, భాస్కర్, మూర్తి తదితరులు కూలి పనులు చేసుకుంటూ మృతి చెందిన రాజీవ్‌కాలనీవాసి రంగస్వామి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

ఆర్టీఏ అధికారుల ఆకస్మిక తనిఖీలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వీర్రాజు నేతృత్వంలో 11 మంది ఎంవీఐలు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 186 బస్సులను తనిఖీలు చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లేని 4 వాహనాలు, ఇన్సూరెన్స్‌లేని 6 వాహనాలు, పొల్యూషన్ సర్టిఫికెట్‌లేని 11 వాహనాలు, ట్యాక్స్ చెల్లించని 3 వాహనాలు, పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళుతున్న 10 వాహనాలు, ఇతర నిబంధనలు అతిక్రమించిన 4 వాహనాలపై కేసులు నమోదు చేశారు.

రామగిరిలో భారీ వర్షం

రామగిరి, ఆగస్టు 13: రామగిరిలో మంగళవారం భారీ వర్షం కురిసింది. 46.4 మిల్లీ మీటర్ల వర్షంపాతం నమోదయ్యింది.

దుబ్బార్లపల్లిలో బొడ్రాయికి పూజలు

రామగిరి, ఆగస్టు 13: మండలంలోని దుబ్బార్లపల్లి గ్రామంలో బొడ్రాయికి మంగళవారం పూజలు నిర్వహించారు. 101 బిందె నీళ్లు, పుష్పాలు, తమలపాకులతో బొడ్రాయికి పూజలు చేశారు. వచ్చే శుక్రవారం మూడవ సారి బొడ్రాయికి వర్షం కోసం పూజలు నిర్వహించడం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు.

గార్లదిన్నె: మండలంలోని పాతకల్లూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం గ్రామస్థులు వర్షం కురవాలని ప్రత్యేక పూజలు చేశారు. చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, పెద్దమ్మలకు ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం గ్రామంలోని బొడ్రాయి నీళ్లు పోశారు. వర్షం కురవాలని ప్రార్థించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె, ఆగస్టు 13: మినీ గోకులాల నిర్మాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశువైద్యాధికారి రమేష్ మంగళవారం తెలిపారు. మండలానికి 50 మినీగోకులాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. అర్హులైన రైతులు జాబ్‌కార్డ్, స్థలం హక్కుపత్రం, బ్యాంకు పాసుబుక్కు అందించాలన్నారు. వివరాలకు గార్లదిన్నె, యర్రగుంట్ల పశువైద్యశాలలో వైద్యులను సంప్రదించాలని సూచించారు.

విజయవంతం చేయండి

నార్పల, ఆగస్టు 13: రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ అరుణకుమారి అన్నారు. ఈనెల 16 నుంచి సదస్సులను జరగనున్నాయన్నారు. మంగళవారం వీఆర్వో, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహులు, ఆర్ఐ జ్యోతిరాణి పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్‌పై అవగాహన

శింగనమల ఆగస్టు 13: సర్పంచ్‌లకు వర్మీ కంపోస్టుపై అవగాహన అవసరమని ఎంపీడీఓ నిర్మలాకుమారి అన్నారు. రెండో రోజు శిక్షణలో భాగంగా కల్లుమడి సంపద కేంద్రాన్ని ఎంపీడీఓతోపాటు సర్పంచ్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే అభివృద్ధి: ఎంపీడీఓ

గార్లదిన్నె, ఆగస్టు 13: ప్రణాళికలు తయారు చేసుకుని వాటిని అమలు చేసుకుంటూపోతే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ విజయభాస్కర్ సూచించారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ, చెత్త నుంచి సంపద నిర్వహణపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ తరగతుల్లో ఎంపీడీఓ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటలక్ష్మీ, కార్యదర్శులు రవిచంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మంజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

శింగనమల ఆగస్టు 13: పంచాయతీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పెద్దమట్లగొంది సర్పంచ్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హాయంలో పంచాయతీల వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఆగస్టు 15కు నిధులను కేటాయించిన సీఎం, ఉపముఖ్యమంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'సమస్యల పరిష్కారానికి కృషి చేయండి'

గార్లదిన్నె, ఆగస్టు 13: భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ బండారు ఈరమ్మ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి భూములు, రస్తాలు తదితర విషయాలపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

శింగనమల: సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ బ్రహ్మయ్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్‌రావు, సర్వేయర్ గోవిందరాజు, ఆర్ఐ హనుమాన్ పాల్గొన్నారు.

సచివాలయ సేవలు ప్రారంభం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 13: మండలంలోని బసంపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సచివాలయ సేవలను మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల కోరిక మేరకు పరిటాల సునీత స్పందించి సచివాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వారంలో మంగళ, గురు, శనివారాల్లో బసంపల్లి గ్రామంలోనే సచివాలయ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ భాస్కర్, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, సీబీడబ్ల్యూ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

త్వరలో బండమీదపల్లి చెరువుకు హంద్రీనీవా నీరు

రాప్తాడు, ఆగస్టు 13: త్వరలో బండమీదపల్లి చెరువుకు ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో హంద్రీనీవా నీరు రానున్నాయని మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు తెలిపారు. కనగానపల్లి మండలం కోనాపురం సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద కనగానపల్లి, లాలాసాహెబ్‌పల్లి, బండమీదపల్లి చెరువులకు నీరు వచ్చే తూమును టీడీపీ నాయకులు, మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సొంత జిల్లా చిత్తూరుకు నీరు తరలించేందుకు తూములను మట్టి, రాళ్లతో మూసివేయించారన్నారు. తూముకు అడ్డుగా ఉన్న రాళ్లు, మట్టిని నాయకులు తీసివేశారు.

సేవలకు గుర్తింపు

అనంతపురంరూరల్, ఆగస్టు 13: జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నుంచి గుర్తింపు వచ్చిందని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. సిండికేట్‌నగర్ సమీపంలోని హోసన్నా హోలీ గాడ్ చర్చ్‌లో అసోసియేషన్ 50వ సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమానికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ సౌత్ ఇండియా జాయింట్ డైరెక్టర్ ఎలియాజరు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్టిఫికేట్‌ను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మార్కు, కార్యదర్శి ఆనంద్, కోశాధికారి జీవన్‌బాబు, ఈసీ మెంబర్లు రూఫస్‌కుమార్ పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

నార్పల, ఆగస్టు 13: హర్‌ఘర్ తిరంగాపై బీజేవైఎం నాయకులు విద్యార్థులతో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర్ మాట్లాడుతూ యువతలో జాతీయవాదం పెంపొందడం కోసం ర్యాలీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నార్పల మండల అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాగార్జున, శింగనమల కోకన్వీనర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలి



కుందుర్పిలో 300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగలా జరుపుకుందాం: వక్తలు



పామిడిలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ ప్రభాకరనాయక్ తదితరులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ప్రతి విద్యార్థి విద్యతో పాటు దేశ భక్తిని పెంపొందించుకోవాలని వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం పండుగలా జరుపుకుం దా మని పి లుపు నిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మంగళవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పట్టణాలతో పాటు మండలకేంద్రాల్లో కళాశాలలు, పాఠశాలల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా స్థానిక తహసీల్దార్లు, విద్యాశాఖాధికారులు, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. గుంతకల్లు శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో విద్యార్థు లకు స్వాతంత్ర్య ఉద్యమం అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు.



బెళుగుప్పలో ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ రామకృష్ణ, టీడీపీ నాయకులు



రాయదుర్గం డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థుల మానవహారం



బెళుగుప్పలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న యువత



శంకరానందగిరి కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోపాల్



తాడిపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పుట్లూరులో...

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి: బీజేపీ



గుంతకల్లులో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ, బీజేవైఎం నాయకులు



500 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు13: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, రాయలసీమ జోనల్ ఇన్చార్జి కాపు రామచంద్రరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజూల వెంకటేష్ పేర్కొ న్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు 500మీటర్ల జాతీయ జెండాతో కదలగా స్థానిక రైల్వే క్రీడా మైదానం నుంచి పొట్టి శ్రీరాముల విగ్రహం వరకు ర్యాలీ సాగింది.

ఉరవకొండ: దేశభక్తిని చాటుతూ ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగుర వేద్దామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొనకొండ్ల రాజేష్ పేర్కొన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణం మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.. అలాగే వజ్రకరూరు మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఉరవకొండలో బీజేవైఎం ఆధ్వర్యంలో ర్యాలీ

వర్షం కోసం పూజలు



అమ్మవారికి నైవేద్యాలు తీసుకెళ్తున్న గ్రామస్థులు

ఉరవకొండ, ఆగస్టు13: వజ్రకరూరు మండలంలోని గూళ్యపాలెంలో వర్షం కోసం మంగళవారం గ్రామస్థులు పూజలు నిర్వహించారు. గ్రామసమీపంలోని కొండ మీద వెలసిన భగవతమ్మ దేవతకు మహిళలు నైవేద్యాలు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. ప్రతియేటా ఆ గ్రామంలో వర్షం కోసం అమ్మవారికి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

బొమ్మనహాళ్, ఆగస్టు 13 : రైతులు తమ పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సాయికుమార్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలవ్యాప్తంగా వివిధ రకాల పంటలు 9700 ఎకరాలలో సాగైనట్లు తెలిపారు. ఖరీఫ్‌లో సాగుచేసిన రైతులు తమ పంటలను ఈ పంట నమోదు చేయించుకునేందుకు సెప్టెంబరు 15వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

గుత్తి, ఆగస్టు13: స్వాతంత్రం దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ నబీరసూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో పోలీస్ సిబ్బందితోపాటు పట్టణం, మండలంలోని యువకులు, ప్రజలు పాల్గొని రక్తదానం చేయాలనిపిలుపునిచ్చారు.

పరిశుభ్రతపై అవగాహన

బొమ్మనహాళ్, ఆగస్టు 13: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బొమ్మనహాళ్ వైద్యాధికారి మల్లేశ్వరి కళాశాలలో చదువుతున్న బాలికలకు శనివారం రుతుస్రావం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కౌమారదశలో బాలికల్లో జరిగే శారీరక, మానసిక మార్పుల గురించి వివరించారు. కేజీబీవీలోని రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలపై ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ వివరించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ కమలమ్మ, మోహన్‌కుమార్, మేనేజర్ మహేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో పరిష్కరిస్తాం : డీఈ

బ్రహ్మసముద్రం, ఆగస్టు 13 : మండలంలో విద్యుత్ సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తామని డీఈ శేషాద్రి శేఖర్ రైతులకు తెలిపారు. పది రోజులుగా వ్యవసాయానికి విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వేపులపర్తి సబ్‌స్టేషన్ వద్ద రెండు రోజు లుగా ధర్నా నిర్వహిస్తున్నారు. దీంతో డీఈ శేషాద్రి శేఖర్, ఏడీఈ శ్రీనివాస్‌నాయుడు, ఏఈ బాలచందర్ మంగళవారం రైతులతో చర్చించారు. ఆరు ఫీడర్లు ఉండగా కేవలం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఉండటంతో సమస్య ఏర్పడిందన్నారు. రైతులకు పగటివేళ నాలుగు గంటలు, రాత్రికి మూడు గంటలు నాణ్యమైన విద్యుత్ అందేలా చూస్తామని తెలిపారు. అదేవిధంగా చాలా లైన్లు పాతవని, వాటిని తొలగించి కొత్త వైర్లు లాగితే సమస్య లేకుండా ఉంటుందన్నారు. సాధ్యమైనంత వరకు లైన్లు మార్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

'వడ్డెర్ల సమస్యలపై పోరాడుదాం'

ఉరవకొండ, ఆగస్టు13: వడ్డెర్ల సమస్యలపై సంఘటితంగా పోరాడుదామని జాతీయ వడ్డెర్ల ఐక్యతా ఎస్టీ సాధన సమితి అధ్యక్షుడు కుళ్లాయప్ప పేర్కొన్నారు. పట్టణంలోని రోడ్లు, భవనాల వసతి గృహంలో వడ్డెర్ల ఆత్మీయసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. వడ్డెర్లు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరముందన్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు లాల్‌స్వామి, బీమేష్, చిన్నబాబు, శంకరయ్య, శివరుద్ర, శ్రీనివాసులు, త్యాగయ్య, వీరన్న పాల్గొన్నారు.

భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారు

బాధితురాలి ఫిర్యాదు... ఆరుగురిపై కేసు నమోదు

కూడేరు, ఆగస్టు 13 : మండలకేంద్రమైన కూడేరుకు చెందిన జ్ఞానిక అనే మహిళను వేధిస్తున్నారని, ఆమె భర్తతోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కూడేరుకు చెందిన జ్ఞానికకు కర్నూల్ జిల్లా తుగ్గలి మండలం ఆర్ఎస్ పెండెకల్లుకు చెందిన విజయ్‌తో ఈ ఏడాది మార్చిలో వివాహమైంది. వివాహమైన కొద్ది రోజులకు ఆమె గర్భం దాల్చింది. ఆమెను నిత్యం భర్త విజయ్‌తో పాటు అతడి తల్లి ప్రమీళ, తండ్రి గోపాల్, అన్న బ్రహ్మయ్య, వదిన బ్రాహ్మణి, అక్క పుణ్యవతి వేధిం పులకు గురిచేశారు. అంతటితో ఆగకుండా తన అనుమతి లేకుండా గర్భం తొలగిం చారని జ్ఞానిక తల్లిదండ్రులకు తెలిపింది. ఈ మేరకు జ్ఞానిక, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా... బాధితురాలి భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసునమోదు చేసినట్లు కూడేరు పోలీసులు తెలిపారు. ఇందులో భర్త విజయ్‌ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కూడేరు, ఆగస్టు 13 : మండలకేంద్రమైన కూడేరుకు చెందిన తలుపూరు నారాయణ (48) అనే రైతు తన వ్యవసాయ తోటలో విద్యుదాఘాతానికి గురై మృతిచెం దినట్లు పోలీసులు తెలిపారు. తన మూడెకరాల పొలంలో వేరుశనగ సాగు చేస్తున్నాడు. నారాయణ మంగళవారం ఉదయం స్ప్రింక్లర్ల ద్వారా పంటకు నీటిని అందించేందుకు తోటకు వెళ్లాడు. తోటలోనే విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తోట వద్దకు పరుగులు తీశారు. అప్పటికే అతడు మృతి చెంది ఉండడంతో బోరున విలపించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి భార్య ముత్యాలమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు.

బోరుబావి ధ్వంసం

పెద్దవడుగూరు, ఆగస్టు13: తన వ్యవసాయ బోరు బావిని మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు వేసి ధ్వంసం చేశారని మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే రైతు వాపోయాడు. తనకున్న ఆరెకరాల పొలంలో వేరుశనగ, వరిపంటను సాగుచేశానని తెలిపాడు. గుర్తుతెలియని వ్యక్తుల చర్యతో ఆర్థికంగా నష్టపోయాయని వాపోయాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు తెలిపాడు.

యువకుడి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, ఆగస్టు 13: పట్టణంలోని బీఎస్ఎస్ కాలనీకి చెందిన నవీన్‌కుమార్(23) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బీఎస్ఎస్ కాలనీకి చెందిన నగేశ్ కుమారుడు నవీన్‌కుమార్ ఆరు నెలల క్రితం కల్లూరులోని బేకరీలో పనిచేసేవాడు. మూడు నెలల క్రితం గుంతకల్లుకు తిరిగొచ్చాడు. అతడికి ఈ మధ్య మతిస్థిమితం సరిగా లేదు. అతడు సోమవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి గదిలో పడుకున్నాడు. ఉదయం 8 గంటలకు మృతుడి అన్న, వదిన వాకిలి కొట్టగా తెరవలేదు. వారు వాకిలి పగుల గొట్టి లోపలకెళ్లగా ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ గణేష్ తెలిపారు. మృతదేహాన్ని మంగళవారం మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చిన్నపొలమడలో మరో యువకుడు...

తాడిపత్రి, ఆగస్టు13: మండలంలోని చిన్నపొలమడ గ్రామంలోని ప్రబోధానంద ఆశ్రమంలో మంగళవారం రాత్రి శ్రీకాంత్ (27) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. గుంటూరుకు చెందిన శ్రీకాంత్ ఐదేళ్లుగా ప్రబోధానంద ఆశ్రమంలో పనిచేస్తూ అక్కడే ఉండేవాడు. వెన్నెముక సమస్య ఉండడంతో పలు ఆసుపత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయింది. దీంతో మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ తెలిపారు. మృతుడికి భార్య ప్రీతిమస్విత ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నెల్లూరులో తాడిపత్రి విద్యార్థి...



ప్రదీప్ కుమార్ (ఫైల్)

తాడిపత్రి, ఆగస్టు13: నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో డెంటల్ కోర్సు అభ్యసిస్తున్న తాడిపత్రికి చెందిన విద్యార్థి ప్రదీప్‌కుమార్ (20) సోమవారం తెల్లవారుజామున కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తండ్రి నారాయణ తెలిపారు. నెల్లూరు నుంచి 20ఏళ్ల క్రితం ఉపాధి కోసం నారాయణ, లలిత దంపతులు తాడిపత్రికి వచ్చారు. నారాయణ వృత్తిరీత్యా సిమెంట్‌తో తయారుచేసే తొట్లు, రింగులు తదితర వాటితోపాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవాడు. వారికి ఇద్దరు సంతానం కాగా పెద్దకుమారుడు అఖిల్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, రెండో కుమారుడు ప్రదీప్‌కుమార్ డెంటల్ కోర్సు అభ్యసిస్తున్నాడు. కొంతకాలంగా సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేస్తున్నారని ప్రదీప్‌కుమార్ తన వద్ద పలుమార్లు చెప్పాడని తండ్రి తెలిపారు. కారకులైన సీనియర్ విద్యార్థులను కఠినంగా శిక్షించాలన్నాడు. ప్రదీప్‌కుమార్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వైద్య సిబ్బంది నిరసన

తాడిపత్రి, ఆగస్టు13: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో మహిళ డాక్టర్‌పై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారం వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంట్ డేవిడ్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను రక్షించే డాక్టర్లపై కూడా అత్యాచారాలు జరుగుతున్నాయంటే సమాజం ఎక్కడికి వెళుతోందన్నారు. వైద్య సిబ్బంది కృష్ణవేణి, భగీరథ, మంజుల, శ్రీనివాసరెడ్డి, పరిమళ, సౌజన్య, పవన్, వసంత, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటికి కిలో వెండి వితరణ

గుంతకల్లు టౌన్, ఆగస్టు 13: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామికి పట్టణానికి చెందిన టీ శ్రీనివాసులు రెడ్డి, అశ్విని దంపతులు మంగళవారం కిలో వెండి బిస్కెట్లను సమర్పించారు. తమ కుమార్తె టీ ప్రహ్యరెడ్డి పేరున స్వామివారికి ఆభరణాలు చేయించేందుకు వాటిని ఆలయ ఈఓ భద్రాజీకి కేజీ అందజేసినట్టు తెలిపారు. రు. అర్చకులు వారి పేరట అర్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ - ముగ్గురికి గాయాలు

తాడిపత్రి, ఆగస్టు13: పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్న సంఘటనలో బస్సు డ్రైవర్ వీఎస్ వలితోపాటు మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. తాడిపత్రి- అనంతపురం ప్రధాన రహదారిలో రోడ్డు పనులు జరుగుతుండడంతో ఒకేవైపు నుంచి బస్సు, లారీ ఎదురెదురుగా వచ్చా యి. అనంతపురం నుంచి తాడిపత్రికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముచ్చుకోట సమీపంలోకి రాగా నే... అనంతపురం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. దీంతో బస్సు, లారీ ముందుభాగాలు దెబ్బతిన్నాయి. ఈ సంఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ప్రయాణికులను మరో బస్సులో తాడిపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేశామని పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సుల తనిఖీ

రాయదుర్గంరూరల్, ఆగస్టు 13: రాయదుర్గం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నడుపుతున్న బస్సులను అనంతపురం ఆర్టీఓ శ్వేతబిందు తనిఖీ చేశారు. ప్రత్యేకడ్రైవ్‌లో భాగంగా ఆర్టీఓ మంగళవారం పట్టణంలోని లక్ష్మీబజార్, ఆర్అండ్‌బీ అతిథి గృహం, పెట్రోల్ బంక్ వద్ద పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. బస్సుల నిర్వహణ, రికార్డులు తనిఖీ చేశారు. వాహనాల డ్రైవర్లకు పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా పలు రికార్డులు లేని వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఆర్టీఓ తెలిపారు.

మొక్కు చెల్లించిన టీడీపీ నాయకులు



టెంకాయలు కొట్టిన టీడీపీ నాయకులు

యాడికి, ఆగస్టు13: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, జేసీ అశ్మిత్‌రెడ్డి ఎమ్మెల్యే కావాలని కోరుకున్న మొక్కును టీడీపీ నాయకులు మంగళవారం చెల్లించుకున్నారు. మాజీ మండల కన్వీనర్ మాదాల అనిల్ ఆధ్వర్యంలో రాయలచెరువులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం





దుండగులు పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్లు, అక్కడే వదిలేసిన సామగ్రి

పామిడి, ఆగస్టు 13: మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు భీబత్సం సృష్టిస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎదురుగా రైల్వే వంతెన సమీపంలోని పంటపొలాలకు చెందిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు మంగళవారం వేకువజామున ధ్వంసం చేశారని ట్రాన్స్ కో అధికారులు, బాధిత రైతులు తెలిపారు. రైల్వే వంతెన సమీపంలోని పంటపొలాల్లో 16కేవీ కెపాసిటీ ఉన్న మూడు ట్రాన్స్ ఫార్మర్ల ద్వారా తొమ్మిది మంది రైతులు వివిధ పంటలను సాగుచేస్తున్నారు. ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్ దాదాపు రూ. లక్ష విలువ చేస్తుంది. వాటిలోని కాపర్ వైర్ కోసమే ఈ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసినట్లు వారు వెల్లడించారు.

ఈ సంఘటనతో దాదాపు 47 ఎకరాలకు సాగునీరు నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ చోరీపై బాధిత రైతులందరూ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

మోస్తరు వర్షం



దేవగిరి పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపునీరు

బొమ్మనహాళ్, ఆగస్టు 13: మండలంలోన ఉద్దేహాళ్, గోనేహాళ్, శ్రీధరఘట్ట, దేవగిరి తదితర గ్రామాలలో సోమవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరినాట్లు వేస్తున్న సమయంలో ఈ వర్షం వల్ల కొంతమంది ఉపశమనం కలుగుతుందన్నారు. దేవగిరి గ్రామంలో పాఠశాల ఆవరణలో భారీగా నీరు చేరి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. రాకపోకలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటిని తోడేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బెళుగుప్ప : మండలంలో సోమవారం రాత్రి 13.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నల్లరేగడి భూముల్లో రబీ పంటలు సాగు చేసే రైతులలో ఆశలు చిగురిస్తున్నాయి.

కేజీబీవీని తనిఖీ చేసిన న్యాయాధికారి



విద్యార్థినితో మాట్లాడుతున్న న్యాయాధికారి మంజుల

గుంతకల్లు టౌన్, ఆగస్టు 13: పట్టణంలోని దోనిముక్కల రోడ్డులో ఉన్న కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని గుంతకల్లు జూనియర్ ఫస్ట్‌క్లాస్ సివిల్ కోర్టు న్యాయాధికారి జి మంజుల మంగళవారం తనిఖీ చేశారు. విద్యాలయంలో వంటగది, టిఫిన్ పంపిణీ, తరగతి గదులు, వి ద్యార్థినుల గదులతో పాఆటు విద్యార్థినుల, ఉపాధ్యాయినుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థినులతో మా ట్లాడి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. భోజనం సరిగా లేదని, మినరల్ వాటర్ ప్లాంటు పనిచేయడం లేదని విద్యార్థినులు న్యాయాధికారికి తెలిపారు. ఈ సందర్భంగా న్యాయాధి కారి మాట్లాడుతూ విద్యార్థినులు ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది తాజుద్దీన్, ఏఎస్ఐ శ్రీనివాసులు, ఇన్చార్జి ఏఎస్ఓ కాంచన తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా టోర్నీకి తాడిపత్రి క్రీడాకారుడు



ఎంపికైన లక్ష్మణ్‌కుమార్

తాడిపత్రి, ఆగస్టు13: ఆర్డీటీ క్యాంప్‌కు చెందిన క్రీడాకారుడు లక్ష్మణ్‌కుమార్ సీనియర్ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికై అంతర్‌జిల్లా టోర్నమెంట్‌లో ఆడనున్నట్లు కోచ్ సాధిక్ వలి తెలిపారు. నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగే టోర్నమెంట్‌లో లక్ష్మణ్‌కుమార్ ఆడనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికపట్ల ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి పెట్టాలి: ఎంపీడీఓ

బొమ్మనహాళ్, ఆగస్టు 13 : గ్రామపంచాయతీ అభివద్ధికి చెత్త నుంచి సంపద సృష్టిపై సర్పంచులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓఆర్డీ దాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. చెత్త నుండి సంపద తయారీపై అవగాహన కల్పించారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వాడకంలోకి తీసుకురావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చిక్కణ్ణ పేర్కొన్నారు. ఆయన మంగళవారం 74 ఉడేగోళంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రజల నుంచి సేకరించిన చెత్తద్వారా సంపదను సృష్టించేందుకు సమష్టిగా కృషిచేయాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం ఆయన డంపింగ్‌యార్డుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

యాడికి: ఆదాయ వనరుల పెంపుతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఈఓపీఆర్డీ వెంకటేష్ తెలిపారు. శిక్షణలో భాగంగా మంగళవారం చెత్త నుంచి సంపద సృష్టిపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్థలాలను కాపాడండి

తాడిపత్రి, ఆగస్టు13: పట్టణంలోని నందలపాడులో ఆంజనేయస్వామిమాన్యంలోని సర్వేనెంబరు 9లో వైసీపీ కౌన్సిలర్‌తోపాటు మరో వ్యక్తి కొన్ని స్థలాలను ఆక్రమించుకున్నారని మంగళవారం కాలనీవాసులు పలువురు డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఖాళీ స్థలాలను ఆక్రమించుకొని నకిలీ పట్టాలను సృష్టించి విక్రయాలు కూడా జరిపారన్నారు. వారి ఆగడాలు ఎక్కువయ్యాయని మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు జీవనానికి ఇబ్బందులు కలిగిస్తున్నారని వారు వాపోయారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు కుళ్లాయప్ప, రామాంజనేయులు, రాంమోహన్ తదితరులు ఉన్నారు.

పదోన్నతుల తర్వాతే పని సర్దుబాటు జరగాలి: ఎస్టీయూ

పామిడి, ఆగస్టు 13 : ఉపాధ్యాయుల పదోన్నతుల తర్వాతనే పని సర్దుబాటు జరగాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం సమస్యల సేకరణ-సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రామాంజనేయులు, వీ చంద్రశేఖర్, జిల్లా నాయకులు నాగభూషణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పశుపతినాథ దేవాలయాన్ని సందర్శించిన డీఎస్పీ

రాయదుర్గం రూరల్, ఆగస్టు 13: మండలంలోని చదంగొల్లలదొడ్డి సమీపంలో ఉన్న అతి పురాతన పశుపతినాథుడి ఆలయాన్ని డీఎస్పీ రవిబాబు మంగళవారం సందర్శించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి క్షుద్ర పూజలు నిర్వహించి ఆ ఆలయంలోని నంది విగ్రహా న్ని ధ్వంసం చేసిన విషయం విదితమే. దీంతో డీఎస్పీ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో నంది విగ్రహం ధ్వంసం గురించి పూజారిని, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. దేవాలయాల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎస్పీతో పాటు అర్బన్ సీఐ శ్రీనివాసులు ఉన్నారు.

మెచ్చిరి గ్రామ సందర్శన

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామాన్ని డీఎస్పీ రవిబాబు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. నెల రోజుల క్రితం టీడీపీ నాయకుడు ఆదెప్ప దారుణహత్యకు గురికావడంతో గ్రామంలో ఎలాంటి గొడవలు జరుగకుండా పోలీస్‌పికెట్‌ను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా డీఎస్పీ గ్రామంలో పోలీస్‌సిబ్బందితో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. ఎలాంటి గొడవలు లేకుండా జీవనాన్ని కొనసాగించాలన్నారు. గ్రామంలో గొడవలు సృష్టిస్తే ఎంతటి వారినైనా కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. డీఎస్పీతో పాటు సీఐ శ్రీనివాసులు ఉన్నారు.

వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షుడిగా వన్నూరుస్వామి

విడపనకల్లు, ఆగస్టు 13: మండలంలోని ఉండబండ గ్రామానికి చెందిన హెచ్ వన్నూరుస్వామిని రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం ఉరవకొండ నియోజక వర్గం గౌరవాధ్యక్షుడిగా మంగళవారం ఎన్నుకున్నట్లు వాల్మీకి బోయ సంఘం జిల్లా నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ఎన్ని కల్లో విడపనకల్లుకు చెందిన హెచ్ వన్నూరు స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర జనరల్ కార్యదర్శి క్రాంతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. వన్నూరుస్వామి మాట్లాడుతూ వాల్మీకుల హక్కుల సాధనకు తోడుగా ఉంటానని తెలిపారు.